క్లుప్తంగా

కారు ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

మార్కాపురం టౌన్: కారు ఢీకొని భార్యాభర్తలకు గాయాలైన సంఘటన ఆదివారం సాయంత్రం మార్కాపురం పట్టణ శివార్లలోని అల్లూరి పోలేరమ్మ గుడి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కనిగిరి మండలంలోని కొత్తపల్లికి చెందిన రమేష్, అనూష దంపతులు ఉద్యోగరీత్యా పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం తమ టూవీలర్‌పై భార్యాభర్తలిద్దరూ తర్లుపాడు రోడ్డులోని అల్లూరి పోలేరమ్మ గుడివైపు వెళ్తుండగా మార్కాపురం నుంచి తర్లుపాడు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు రోడ్డుపై పడిపోవడంతో గాయాలయ్యాయి. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ తల్లి



ప్రత్యేక అలంకరణలో సత్యమాంబదేవి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్ట, నాగశిలలకు పూజలు చేశారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్ కుమార్ శర్మ అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు వద్ద కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

పొలం విషయమై ఘర్షణ

- పలువురికి గాయాలు

మార్కాపురం: మండలంలోని బోడపాడు గ్రామంలో పొలం విషయమై చోటుచేసుకున్న ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన పోరెడ్డి నరసింహారెడ్డి, నందిరెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులకు పొలం విషయంలో గత కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాల వారు మార్కాపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలకు గాయాలు కావడంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కాలభైరవ పూజలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు స్వర్ణాకర్షణ కాలభైరవ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మంగమూరురోడ్డులోని గాయత్రి మందిరంలో ఆదివారం ఉదయం విశ్వావసు నామ సంవత్సర మొదటి అమావాస్య సందర్భంగా కాలభైరవ చిత్రపటానికి ప్రముఖ పురోహితుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్వర్ణాకర్షణ వారి ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలు అందజేశారు. స్వర్ణాకర్షణ కాలభైరవ సేవా సమితి నిర్వాహకులు దేసు వెంకట సుబ్బారావు, పబ్బిశెట్టి భానుకిరణ్, పచ్చిపులుసు శ్రీకాంత్, దేసు కాశీవిశ్వేశ్వరరావు, మనోహర్, గద్దం రాజేష్, పచ్చిపులుసు లోకేష్, భాస్కరుని మురళీమోహన్, ప్రశాంత్ సుబ్బరాజు, సునీల్, కారంశెట్టి అమర్, సమితి సభ్యులు పాల్గొన్నారు.



..ఫ్ చేదు ఫలితం!

గిద్దలూరు నియోజకవర్గ ప్రభుత్వ పాఠశాలల్లో భారీగా పడిపోయిన ఉత్తీర్ణత శాతం

- 2023-24 విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 9 శాతం తగ్గిన ఉత్తీర్ణత
- ఉపాధ్యాయుల కొరతతో పలు సబ్జెక్టుల్లో తప్పిన విద్యార్థులు
- ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణపై కూటమి సర్కారు నిర్లక్ష్యం



బేస్తవారిపేట:

ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాలు, పటిష్టమైన ప్రణాళిక లేకపోవడం, విద్యాశాఖపై కొరవడిన పర్యవేక్షణ, ఉపాధ్యాయుల కొరత, విద్యార్థులకు సక్రమంగా అందని బోధన వెరసి పదో తరగతి పరీక్ష ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపాయి. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో పేద పిల్లలు చదువుకు దూరమయ్యే దుస్థితి నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది ఫెయిలయ్యారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తొలిమెట్టు లాంటి పదో తరగతిపై కూటమి సర్కారు అలసత్వం చూపడంతోనే ఈ చేదు ఫలితాలు వచ్చాయని విద్యావేత్తలు పెదవి విరుస్తున్నారు.

ఏడాదిలో ఎంత తేడా!

2023-24వ విద్యా సంవత్సరం టెన్త్ ఫలితాలు

మండలం	పరీక్షకు హాజరైన విద్యార్థులు	పాస్	ఫెయిల్
కొమరోలు	350	330	20
రాచర్ల	389	372	17
గిద్దలూరు	1,236	1,107	129
కంభం	493	412	81
బేస్తవారిపేట	426	383	43
అర్ధవీడు	393	378	15
మొత్తం	3,287	2,982	305

2024-25వ విద్యా సంవత్సరం టెన్త్ ఫలితాలు

మండలం	పరీక్షకు హాజరైన విద్యార్థులు	పాస్	ఫెయిల్
కొమరోలు	386	212	174
రాచర్ల	361	293	68
గిద్దలూరు	1186	1,063	122
కంభం	489	364	125
బేస్తవారిపేట	363	287	76
అర్ధవీడు	401	384	13
మొత్తం	3,186	2,603	578

'పది'పోయిన ఉత్తీర్ణత శాతం

మండలం	2023-24	2024-25
బేస్తవారిపేట	89.9	79.06
కంభం	83.56	62.5
గిద్దలూరు	90	90
కొమరోలు	94.2	54.9
రాచర్ల	95.43	81
అర్ధవీడు	96	96
మొత్తం	90.72	81.70

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో..

- విద్యా సంవత్సరం ప్రారంభంలోనే టీచర్ల కొరత సర్దుబాటు చేసి బోధన
- సకాలంలో సిలబస్ పూర్తి, ప్రణాళిక అమలు
- ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక మెటీరియల్ ముద్రించి సరఫరా
- ప్రణాళిక ప్రకారం రివిజన్ తరగతుల నిర్వహణ
- ఉత్తమ ఫలితాల కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు
- కీలకమైన 77 రోజుల కార్యాచరణ, ప్రత్యేక తరగతుల నిర్వహణ

నేటి టీడీపీ కూటమి ప్రభుత్వంలో..

- విద్యా సంవత్సరం మధ్యలో టీచర్లను సర్దుబాటు చేయడం
- జనవరి, ఫిబ్రవరి నెలల్లోనూ సిలబస్ పూర్తి చేయని పరిస్థితి
- ప్రత్యేక మెటీరియల్ పరీక్షలకు ముందు ఇవ్వడం
- కీలకమైన కార్యాచరణ లేకపోగా.. ప్రత్యేక తరగతులు ఆలస్యంగా నిర్వహించడం
- రివిజన్ తరగతుల లేమి

కొరవడిన పర్యవేక్షణ

కొమరోలు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడంతో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది కూటమి ప్రభుత్వంలో 10వ తరగతి విద్యార్థులు అత్యధికంగా ఫెయిల్ కావడం, ఎక్కువ మందికి నామమాత్రపు మార్కులు రావడంతో సర్కారు పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మకాన్ని కోల్పోయే పరిస్థితి దాపురించింది. కొమరోలు మండలంలోని 10 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 448 మంది విద్యార్థులకుగాను 177 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ఒక్క కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే 144 మంది 84 మంది ఫెయిల్ కావడం గమనార్హం. అల్లినగరం జెడ్పీ హైస్కూల్లో 33 శాతం మంది, రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 32 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. గోపాలునిపల్లె ఏబీఎం ఎయిడెడ్ హైస్కూల్లో ఒక విద్యార్థి పరీక్ష రాయగా ఆ ఒక్కరూ ఫెయిలయ్యారు. కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 81 మంది విద్యార్థులు, అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులు గణితంలో ఫెయిల్ కావడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కంభం, బేస్తవారిపేట, రాచర్ల మండలాల్లోనూ నెలకొంది.

ఏదీ ఆ ప్రోత్సాహం?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యా రంగంలో నాడు-నేడు కార్యక్రమం కింద వందల కోట్ల రూపాయలు వెచ్చించి పాఠశాలల రూపురేఖలు మార్చింది. విద్యార్థులకు యూనిఫామ్ నుంచి బూట్లు, డిజిటల్ రూములు, ఇంగ్లిష్ మీడియం, బైలింగ్వల్ టెక్స్ బుక్స్, నాణ్యమైన పౌష్టికాహారం ఉచితంగా అందజేసింది. అమ్మఒడి పథకం ద్వారా తల్లులకు ఏడాదికి రూ.15 వేల చొప్పున అందజేసింది. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కుంటి సాకులకే పరిమితమైంది.

ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ



బేస్తవారిపేటలో నిరసన ర్యాలీ



పొదిలిలో కొవ్వొత్తుల ర్యాలీలో విజయలక్ష్మి

బేస్తవారిపేట: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నుంచి జంక్షన్ మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. బస్టాండ్‌లో రాత్రి వేళ సెల్‌ఫోన్ ఫ్లాష్ లైట్స్ వేసి మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పొదిలి: ఉగ్రవాదుల దాడిలో అమరులైన పర్యాటకులకు ఆదివారం బీజేపీ అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక జాఫ్లాపురం రోడ్డులో విద్యార్థులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా మాజీ మంత్రి సురేష్ జన్మదిన వేడుకలు



సురేష్‌కు శుభాకాంక్షలు చెబుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం: స్థానిక జార్జి ఇంజినీరింగ్ కాలేజీలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఏపీ పొల్యూషన్ బోర్డ్ మాజీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, మార్కాపురం, యర్రగొండపాలెం, కొండపి నియోజకవర్గాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలలో సర్వమత ప్రార్థనలు చేశారు. సురేష్ సతీమణి ఇన్‌కంటాక్స్ కమిషనర్ విజయలక్ష్మి, కుమారుడు విశాల్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు కౌన్సెలింగ్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివార్లలో ఓపెన్ డ్రింకింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ఆయన పట్టణ శివారు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు వ్యక్తులు ఆరుబయట మద్యం సేవిస్తుండటాన్ని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి పట్టుబడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. టూవీలర్స్‌పై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని చెప్పారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కంభం: మండలంలోని కందులాపురం ప్రాథమికోన్నతపాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం ఉత్సాహభరితంగా సాగింది. 1997-98వ సంవత్సరంలో ఒకటో తరగతి మొదలు 7వ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. చిన్ననాటి విషయాలు గుర్తు చేసుకుని, ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుంటూ ఆనందంగా గడిపారు. నాడు చదువు చెప్పిన గురువులను, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ షరీఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రంగయ్య, శివశంకర్, గని వెంకటేశ్వర్లు, ఆనందరావు, కేశవ, పూర్వ విద్యార్థులు సాంబ, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మునీశ్వరరెడ్డి, నాగరాజు, దినేష్, అన్న శేఖర్, వెంకటరత్నం, సురేంద్ర, హుస్సేన్, బేగ్, రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద వృద్ధుడికి అంతిమ సంస్కారం

మార్కాపురం: మండలంలోని దరిమడుగు వద్ద ఈనెల 23వ తేదీన వడదెబ్బ సోకి మృతి చెందిన వృద్ధుడిని జిల్లా కేంద్రమైన ఏలూరుకు చెందిన రామచంద్రుని శివకుమార్‌గా(64) బంధువులు గుర్తించి ఆదివారం మార్కాపురం వచ్చారు. పేదరికం కారణంగా అంతిమ సంస్కారాలు కూడా నిర్వహించలేని స్థితిలో ఉండటంతో నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో మురళీ, లింగాల నాగరాజు తదితరులు స్పందించారు. స్థానిక హిందూ శ్మశాన వాటికలో వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహించారు. వివిధ పత్రికల్లో, సోషల్ మీడియాలో వృద్ధుడి మృతిపై కథనాలు చూసి ఆయన సోదరుడు హరిప్రసాద్ మార్కాపురం రూరల్ పోలీసులను సంప్రదించారు. శివకుమార్ గతంలో కనిగిరిలో ఒక ప్రైవేట్ పాఠశాలలో అటెండరుగా పనిచేసి మానేశారు. బంధువుల వద్దకు రాకపోకలు సాగించే క్రమంలో ఈనెల 23న మార్కాపురం ప్రాంతానికి వచ్చి దరిమడుగు శివారులో వడదెబ్బ సోకి మృతి చెందారు.



అంత్యక్రియలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఔను.. బ్లీచింగ్‌కూ దిక్కులేదు!



తర్లుపాడు ప్రధాన రహదారి పక్కన అపరిశుభ్రంగా డ్రైనేజీ

- గ్రామాల్లో పారిశుధ్యంపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం



గొట్లగట్టులో రహదారి పక్కన చెత్త



నాగిరెడ్డిపల్లిలో ఇలా..



తుమ్మలచెరువు ప్రధాన రహదారిలో నిలిచిన మురుగు



కొమరోలు : ఎర్రంశెట్టివానిపల్లెలో నిరుపయోగంగా దర్శనమిస్తున్న రిక్షాలు



మార్కాపురం నెహ్రూ బజారులోని స్టూడియో లైన్‌లో రోడ్డుపైనే చెత్త

మార్కాపురంటౌన్/తర్లుపాడు/కొనకనమిట్ల/కొమరోలు: పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. దోమల దాటికి జనాలు జ్వరాల బారిన పడుతున్నా కూటమి పాలకుల్లో చలనం రావడం లేదు. పలు పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైనా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే రోగాలు దరిచేరవని, మలేరియా లాంటి విష జ్వరాలను అరికట్టవచ్చని వైద్య సిబ్బంది హెచ్చరిస్తున్నా క్షేత్ర స్థాయిలో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు.

మార్కాపురం మున్సిపాలిటీలోని కంభం రోడ్డు, నెహ్రూబజారు, భగత్‌సింగ్ నగర్, పీయస్ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపైకి చేరుతోంది. చెత్తా, చెదారాన్ని రోడ్డు పక్కనే వేస్తుండటంతో దోమలు విజృంభించి జ్వరాలు ప్రబలుతున్నాయి. మేజర్ పంచాయతీల్లోని వీధుల్లో తొలగించిన చెత్తను బయటకు తరలించకుండా రోడ్డు పక్కన మార్జిన్లలో పడేస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మినీ ట్యాంక్‌ల వద్ద వృథా నీరు సజావుగా ముందుకు వెళ్లేందుకు ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఆ పరిసరాల్లోనే నిల్వ చేరి దోమల వ్యాప్తికి కారణమవుతోంది. గత నెలలో పొదిలి మండలంలో డెంగీ కేసు నమోదైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్వచ్ఛభారత్ స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఏర్పాటు చేసిన రిక్షాలు నిరుపయోగంగా మారాయి. కొమరోలు మండలంలోని ఎర్రంశెట్టివానిపల్లె గ్రామంలో రెండు రిక్షాలను కొన్ని నెలలుగా పక్కన పడేశారు. స్వచ్ఛభారత్ కార్మికులకు గౌరవ వేతనం ఇవ్వకపోవడంతో చెత్త తరలింపు నిలిచింది.